

లక్ష్యానికి దగ్గరగా..

ఆఫ్‌షోర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆర్భాటానికి దూరంగా లక్ష్యానికి దగ్గరగా పనులవుతున్నాయి. - 8లో



సర్వే శాఖలో దొంగలు పడ్డారు

సర్వే శాఖలో దొంగలు పడ్డారు. సాంకేతిక పరికరాలు మాయం చేశారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	37°	25°
ఇచ్ఛాపురం	38°	25°
పాతపట్నం	37°	26°
శ్రీకాకుళం	36°	26°

న్యూస్‌రీల్

రాత్రి వేళల్లో పకడ్బందీగా గస్తీ : ఎస్పీ



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : రాత్రి వేళల్లో పకడ్బందీగా గస్తీ కాయాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. జిల్లా పోలీసు శాఖ అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల సేవలు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆస్తి సంబంధిత నేరాలపై పోలీస్ స్టేషన్ల వారీగా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా వివిధ రకాల నేరాల సరళిని పరిశీలించి నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, నేరస్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో దొంగతనాలు చేసేవారు లాడ్జీల్లో స్టే చేసేందుకు వస్తుంటారని, లాడ్జీలను ఆకస్మిక తనిఖీ చేసి సీసీ కెమెరాలను పర్యవేక్షించి బస చేసే వ్యక్తుల పూర్తి వివరాలు, చిరునామాతో కూడిన గుర్తింపు కార్డు రిజిస్టర్లలో కచ్చితంగా పొందుపరిచే విధంగా లాడ్జి నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. అనుమానిత వ్యక్తులను వారి ఫింగర్ ప్రింట్ ద్వారా వెరిఫై చేసి వారు పాత నేరస్తులా కాదా అన్నది గుర్తించాలన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి స్వయంగా గస్తీలు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చూడాలని, డీఎస్పీలు, సీఐలు వారి వారి పరిధిలో గస్తీలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్రావు, డీసీఆర్బీ సీఐ ప్రసాదరావు, ఫింగర్‌ప్రింట్ విభాగం ఎస్ఐ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పరిశీలన

సారవకోట: ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించనున్న జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని డీఈఓ డాక్టర్ తిరుమలచైతన్య సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ఎంఆర్సీకి చేరిన విద్యాకానుక కిట్లను పరిశీలించారు. యూనిఫారం, నోట్, పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు అన్ని ఎమ్మార్సీలకి పంపిస్తున్నామని, వాటి నాణ్యతను పరిశీలించి వచ్చే నెల 5 నాటికి అన్ని పాఠశాలలకు పంపించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి ప్రతీ విద్యార్థికి విద్యా కానుకలోని అన్ని వస్తువులు అందాలన్నారు. ఆయనతో పాటు డైట్ లెక్చరర్ అల్లు అప్పన్న, ఎంఆర్సీ సిబ్బంది ఉన్నారు.

20 బెంచ్‌లలో లోక్ అదాలత్‌లు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల పరిధిలోనూ కేసులు పరిష్కరించామని, 20 బెంచీల ద్వారా లోక్ అదాలత్‌లు నిర్వహించామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కేంద్రంలో లోక్ అదాలత్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీకాకుళంతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పాలకొండ, పలాస, పాతపట్నం, పొందూరు, కొత్తూరు, రాజాం, సోంపేట, టెక్కలి కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని న్యాయమూర్తులందరూ పాల్గొన్నారని, శ్రీకాకుళంలో ఐదు బెంచ్‌లను వ్యక్తిగతంగా పరిశీలించానని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన లోక్ అదాలత్‌లలో 6110 కేసులు పరిష్కరించారు. ఇందులో 77 సివిల్ కేసులు, 5927 క్రిమినల్ కేసులు, 106 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయి.

కనిపెంచే దైవం

ఆకలైతే అమ్మ కావాలి. ఆపదొస్తే అమ్మ రావాలి. భయం వేస్తే అమ్మను తలవాలి. ఆనందమొచ్చినా అమ్మే ఉండాలి. హారంలో దారంలా సర్వకాల సర్వావస్థల్లోనూ అమ్మ ఉండి తీరాలి. నేడు మాతృ దినోత్సవం. వాట్సాప్ స్టేటస్‌లో అమ్మ డీపీలు, సోషల్ మీడియాలో అమ్మ కొటేషన్లు కోకొల్లలుగా కనిపించే రోజు. అమ్మ అడగదు గానీ ఆమెకూ ఓ రోజు సెలవుంటే బాగుంటుంది. ఇవ్వమనదు గానీ ఓ కానుకపై ఆమె పేరు రాసి ఇస్తే మురిసిపోతుంది. అందుకు మదర్స్‌డేను మించిన ముహూర్తం ఏముంటుంది..? ఇదిగో ఇక్కడ ఓ కుమారుడు అమ్మకు గుడి కడుతున్నాడు. ఓ కుమార్తె అమ్మకు గౌరవాన్ని తెచ్చిపెట్టింది.





చీమలవలస గ్రామంలో నిర్మిస్తున్న అమ్మ దేవస్థానం (ఇన్‌సెట్లో) తల్లి అనుసూయదేవి పేరుతో ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న శ్రావణ్‌కుమార్ (ఫైల్)

ఆమదాలవలస రూరల్:

ఆమదాలవలస మండలం చీమలవలస గ్రామానికి చెందిన సనపల శ్రావణ్‌కుమార్ తన తల్లి అనసూయదేవి జ్ఞాపకార్థం గుడి కడుతున్నారు. శ్రావణ్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో వివిధ వ్యాపారాలను చేసుకుంటున్నారు. శ్రావణ్‌కుమార్ తల్లి అనుసూయదేవి 2008లో అనారోగ్యం బారిన పడడంతో శస్త్రచికిత్స చేస్తున్న సమయంలో మృతి చెందారు. తల్లి లేని లోటు శ్రావణ్‌కుమార్ జీవితంలో స్పష్టంగా కనిపించడం.. సమాజానికి సేవ చేసి మంచి పేరు తీసుకురావాలని తల్లి చెప్పడంతో ఆమె మాటలను గుర్తు చేసుకుని అహర్నిశలు శ్రమించి వ్యాపార రీత్యా బాగా స్థిరపడ్డారు. ఇప్పుడు అమ్మ పేరుతో గుడి నిర్మించాలని నిర్ణయించుకున్నారు. సొంత గ్రామం చీమలవలసలోనే రూ. 10 కోట్ల వ్యయంతో కృష్ణశిలతో అమ్మ దేవస్థానాన్ని నిర్మించడానికి నిర్ణయించుకుని 2019 మార్చి నెలలో దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రాచీన కాల పద్ధతిలో కట్టాలని భావించి కృష్ణశిలతో దేవాలయాన్ని నిర్మిస్తే కలకాలం ఉంటుందని నిర్మాణాలు చేపడుతున్నారు. ఆగమశాస్త్రం ప్రకారం ఐదు గోపురాలతో గుడిని నిర్మిస్తున్నారు. ప్రధాన గోపురం 51 అడుగుల ఎత్తులో, మూలవిరాట్టుగా మాతృమూర్తి విగ్రహాన్ని, దేవాలయం చుట్టూ శిల్పకళ ఉట్టిపడేలా నిర్మాణాలు జరుపుతున్నారు. ప్రస్తుతం అమ్మ దేవస్థానం పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేసి అమ్మ దేవస్థానాన్ని మాతృమూర్తులందరికీ అంకితం చేస్తామని శ్రావణ్‌కుమార్ తెలిపారు.

దేవతకు ప్రతిరూపం



నవమాసాలు మోత
బిడ్డల వలన గుండె కోత
చీదరించినా చెరగని ఆప్యాయత
అనురాగాల పాలపోత
సహనం, ఓరిమి కలబోత
కరుణారుణ రక్తాన్ని క్షీర ధారగా
మార్చిన కరుణాంతరంగ
తాను చచ్చి మరో ప్రాణికి
జన్మనిచ్చిన కైవల్య గంగ.
వాత్సల్య లయల మృదుల మృదంగ.
ప్రేమాభిమాన మహోత్తుంగ తరంగ.
అమ్మ... అమ్మ... అమ్మ!

– కుప్పిలి వెంకటరాజారావు, రచయిత, తానా పురస్కార గ్రహీత, ఆమదాలవలస



బిడ్డ కల సాకారం

ఇచ్ఛాపురం రూరల్: భర్త లేడు.. ముగ్గురు కుమార్తెల భారం తలపైన ఉంది. కడుపు నింపడమే కష్టమైన పని. అలాంటిది ఒక బిడ్డ కల సాకారం చేయాలంటే ఆ తల్లికి తలకుమించిన భారమే. కానీ ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు బోర సావిత్రమ్మ. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెందిన బోర మాదయ్య, సావిత్రమ్మలు నిరుపేదలు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మాదయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లి సావిత్రమ్మపైనే కుటుంబ భారం పడింది. తొలి ఇద్దరు అమ్మాయిలను చదివించలేకపోయిన ఆ తల్లి మూడో కుమార్తె త్రివేణిని బడిలో చేర్పించింది. త్రివేణి తెలివైన అమ్మాయి. ఎస్ఐ కావాలని ఎంతో తపించింది. కానీ తల్లి ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించలేదు. ఒకసారి చదువు అర్ధంతరంగా మానేయాల్సి వచ్చింది కూడా. అయినా ఆమె తన గమ్యాన్ని మార్చుకోలేదు. కూతురి ఇష్టాన్ని తెలుసుకున్న సావిత్రమ్మ రేయింబవళ్లు శ్రమించి కుమార్తెను చదివించింది. డిగ్రీ పూర్తి చేయించి, ఎస్ఐ కోచింగ్‌కు అవసరమైన సహాయ, సహకారాలు అందించింది. తల్లి కష్టాన్ని వమ్ము చేయని త్రివేణి 2019లో తెలంగాణలో ఎస్ఐ పరీక్షలో విజయం సాధించింది. ఏఆర్ ఎస్ఐగా రెండేళ్ల పాటు శిక్షణ పూర్తి చేసిన త్రివేణి ఇప్పుడు తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌లో రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఎప్పటికైనా తన కుమార్తె ఆంధ్రలో డీఎస్పీ హోదాలో పనిచేయాలన్నదే తన చిరకాల వాంఛ అని తల్లి చెబుతోంది.



తల్లి సావిత్రమ్మతో కుమార్తె ఎస్ఐ త్రివేణి

కొత్త జీవితమిచ్చారు..





ఈ చిత్రంలో కనిపిస్తున్న నూతన వరుడి పేరు మార్పు సందీప్. ఇతను ఒంటరి వాడు. సొంత ఇల్లు కూడా లేదు. ఆయనకు స్థానిక సర్పంచ్ తడక జోగారావు జగనన్న ఇంటి స్థలం ఇప్పించారు. పలాసపురం జగనన్న కాలనీలో తొలిగా సందీప్ తన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాడు. సొంతిల్లు కట్టుకున్నాక పెళ్లి సంబంధం కూడా కుదిరింది. ఇంకేముంది ఇల్లు కట్టి పెళ్లి కూడా చేసుకున్నాడు. జెడ్పీటీసీ తడక యశోద శనివారం ఈ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్, దేవి దంపతులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మనసారా కృతజ్ఞతలు చెప్పుకున్నారు. సీఎం చేసిన మేలు మరువలేమని, తనకు ఒక కొత్త జీవితాన్ని ఇచ్చారని సందీప్ అన్నారు. చిరకాలం వైఎస్ జగన్ అభిమానులుగానే ఉంటామని చెప్పారు.

- సోంపేట

క్రీడలకు పెద్దపీట: ధర్మాన

శ్రీకాకుళం న్యూకాలనీ, అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ఎదుగుదలకు అవసరమైన అన్ని చర్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బలగలో ఉన్న కాలభైరవ ఆలయ సమీపంలో ఉత్తరేశ్వర కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను మెమొంటోలతో అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ సిక్కోలులో ఎందరో గ్రామీణ క్రీడాకారులు ఉన్నతంగా రాణిస్తున్నారని, వారందరికీ మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకొని ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలు బారిన పడకుండా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించి వారిలో ఆసక్తిని పెంపొందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఎంతో వ్యవప్రయాసలను వెచ్చించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్న రెడ్డి చిరంజీవిలు, ఉత్తరేశ్వర కబడ్డీ సంఘం అధ్యక్షులు రెడ్డి శివన్నారాయణ, రెడ్డి శివరామకృష్ణలను ప్రత్యేకంగా అభినందించారు. చల్లా శ్రీనివాసరావు, సాదు వైకుంఠరావు, టంకాల బాలకృష్ణ, కబడ్డీ సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు బలగ ప్రాంత వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నిర్వాహకులు, క్రీడాకారులు, న్యాయనిర్ణేతలతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

సేవలు భళా.. అందుకోండిలా


- రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు సరళం
- మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే లాభాలెన్నో..
- సద్వినియోగం చేసుకోవాలని సూచన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/ నరసన్నపేట:

రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు సరళతరమయ్యాయి. సామాన్యుడికి కూడా చాలా సులభంగా సేవలు అందేలా ప్రభుత్వం పద్ధతులను మార్చింది. ఒకప్పుడు రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు కావాలంటే డాక్యుమెంట్ రైటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటివేమీ లేకుండా చాలా సులభంగా ప్రతి ఒక్క సేవను చక్కగా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. హిందూ వివాహ చట్టం (1995), సొసైటీ రిజిస్ట్రేషన్, ట్రస్ట్ రిజిస్ట్రేషన్లు చేసుకోవడం చాలా సులువైపోయింది. ఏ ఒక్క రిజిస్ట్రేషన్‌కి ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారం పద్ధతిగా చేస్తున్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి దళారులను ఆశ్రయించకుండా నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులనే సంప్రదించాలని జిల్లా రిజిస్ట్రార్‌సూచిస్తున్నారు.

మ్యారేజ్ రిజిస్ట్రేషన్ ఇలా..


కొత్తగా వివాహం చేసుకునేవారు రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్టిఫికెట్ చేయించుకుంటే ప్రభుత్వం అందించే వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా వంటి లబ్ధిని అందుకోవచ్చు.



నమోదుకు కావాల్సిన పత్రాలు ఇవి..

- వయస్సు నిర్ధారించేందుకు 10వ తరగతి మార్కుల లిస్టు, డాక్టర్ నుంచి వయస్సు సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం ఉండాలి.
- మీకు సౌలభ్యమైన సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి.
- రెసిడెన్సీ ప్రూఫ్ (ఆధార్, ఓటరుకార్డు)
- పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడు ఇరువురి దండలు మార్చుకున్న ఫొటో, తాళి కట్టిన ఫొటో, ఇద్దరూ కలిసి ఉన్న ఫొటో.
- పెళ్లి కార్డులు ఇరువురివి. కల్యాణ మండపం రశీదు.
- వివాహ రిజిస్ట్రేషన్ ఫీజు రూ 200, సిఎఫ్ఎమ్ఎస్ ద్వారా చలానా రూపంలో చెల్లించాలి.
- పెళ్లికి హాజరైన సాక్షులు ముగ్గురు మేజర్లు అయి ఉండాలి, వారి ఆధార్‌కార్డులు ఉండాలి.
- దేవదాయ శాఖ గుర్తింపు పొందిన దేవాలయాల్లో వివాహం చేసుకున్నట్లు రశీదు ఉండాలి.
- హిందూమ్యారేజ్ పోర్టల్‌లో సిటిజన్ లాగిన్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేయాలి.

సొసైటీ రిజిస్ట్రేషన్ ఇలా..



- సొసైటీ రిజిస్ట్రేషన్ చేయాలంటే ఎలాంటి లాభాపేక్ష ఉండకూడదు.
- సొసైటీ రిజిస్ట్రేషన్‌కి ఏడుగురు సభ్యులు తప్పనిసరిగా ఉండాలి. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధానకార్యదర్శి, ట్రెజరర్, సంయుక్తకార్యదర్శి, సభ్యులు ఇద్దరు ఉండాలి.
- ఆన్‌లైన్‌ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- ఏడాది పాటు ఆడిట్ రిపోర్టు తప్పనిసరిగా సబ్మిట్ చేయాలి.
- కార్యవర్గ సభ్యులు జనరల్ బాడీ సమావేశం మినిట్స్, ప్రత్యేక కార్యక్రమాల వివరాలు, మినిట్స్ బుక్‌లో రికార్డు చేయాలి.
- బైలా నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా యాన్యువల్ రికార్డులు ఇవ్వాలి.
- సొసైటీలో ఉండాల్సిన వారి ఆధార్ కార్డులు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు ఉండాలి. • సమావేశానికి హాజరైన వారి సంతకాలు తప్పనిసరిగా ఉండాలి.

ట్రస్ట్ రిజిస్ట్రేషన్ ఇలా..

- ట్రస్ట్‌లో ప్రధానవ్యక్తి ట్రస్టీగా ఉంటారు.
- ట్రస్టీ ఆశయాలను సెట్లర్స్ ట్రస్టీ ఆశయాలను, పనులను చేస్తారు.
- ట్రస్ట్ డీడ్‌కి రూ 500 స్టాంప్ డ్యూటీ చెల్లించాలి.
- అగ్రికల్చర్ ల్యాండ్, భవనం, అమౌంట్‌ని 3శాతం కట్టాలి.
- ట్రస్టీలో మెంబర్ల ఆధార్‌లు, ఫోటోలు, వేలిముద్రలు తప్పనిసరిగా తీసుకుంటారు.



వివాహ నమోదుతో ఎంతో లాభం



హిందూ వివాహ నమోదు చట్టం ప్రకారం కొత్తగా వివాహం చేసుకున్నవారు రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. సొసైటీ రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఆర్థిక పరంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవాభావం కలిగి ఉండాలి. ట్రస్టు రిజిస్ట్రేషన్‌తో సమాజంలో నిరుపేదలకు సేవ చేసేందుకు ఉపయోగపడుతుంది. రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించాల్సిన పనిలేదు. ప్రభుత్వం నిర్దేశించిన డబ్బులను మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది.

– కిల్లి మన్మధరావు, జిల్లా రిజిస్ట్రార్, శ్రీకాకుళం జిల్లా.



అందరికీ అందుబాటులో ఇసుక... పారదర్శక విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక...

శ్రీకాకుళం జిల్లాలో నియోజకవర్గాల వారీగా రీజనబుల్ రవాణా ఛార్జీలతో కలిపి టన్నుకు ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరల వివరాలు ప్రక్కన ప్రకటిస్తున్నాం. జిల్లాలో ఇంతకన్నా ఎక్కువ ధరకు ఎవరైనా మీమీ నియోజకవర్గాల్లో అమ్మితే SEB ఫోన్ నెంబర్ - 089422-27678 కు ఫిర్యాదు చేయండి.. ఎవరైనా ఇంతకన్నా ఎక్కువ ధరకు అమ్మితే 2 లక్షల వరకు జరిమానా, 2 ఏళ్ల జైలు శిక్ష. రెండూ విధిస్తారు. అన్ని రీచ్‌ల వద్ద ఇసుక గరిష్ఠ అమ్మకపు ధర టన్నుకు రూ. 475/- మాత్రమే...

నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర	నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర
ఇచ్ఛాపురం	రూ. 930/-	శ్రీకాకుళం	రూ. 780/-
పలాస	రూ. 920/-	ఆమదాల వలస	రూ. 600/-
టెక్కలి	రూ. 810/-	ఎచ్చెర్ల	రూ. 680/-
పాతపట్నం	రూ. 745/-	నరసన్నపేట	రూ. 525/-

★ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మరింత తక్కువ ధరకు అందేలా అన్ని ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వచ్చాయి..
★ ఇసుక బ్లాక్ మార్కెటింగ్, ట్రాన్స్ పోర్టర్ల సిండికేట్ లకు చెక్ పెడుతూ ఆన్ లైన్‌లో, ఆఫ్ లైన్ తో పాటు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇసుక బుకింగ్ మరియు డోర్ డెలివరీ సదుపాయం..
★ www.andhrasand.com ద్వారా ఇసుక ఆన్‌లైన్ లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించిన JPVL సంస్థ..
★ అందరికీ అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుక పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14500

వినియోగదారుల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 97000 09944

శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ, గనులు, భూగర్భ వనరుల శాఖామాత్యులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గనులు మరియు భూగర్భ శాఖ

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

క్లుప్తంగా

17న యూత్ బాక్సింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా యువ, వర్ధమాన బాక్సింగ్ క్రీడాకారులకు తీపికబురు. ఈ నెల 17న జిల్లాస్థాయి యూత్ చాంపియన్‌షిప్ పోటీలతోపాటు రాష్ట్రపోటీలకు ఎంపికలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా బుధవారం ఉదయం 7 గంటలకు పోటీలు మొదలుకానున్నాయని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ అనంతలక్ష్మణ్‌దేవ్(అను) తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుంచి 21 వరకు విశాఖపట్నం వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. 2005 జనవరి ఒకటి నుంచి 2006 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారు అర్హులని స్పష్టంచేశారు. 46 కేజీల నుంచి 92+కేజీల విభాగం వరకు 13 బరువు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 3 పాస్ ఫొటోలను తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9618905735, 89774 96979 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆదిత్యాలయ అభివృద్ధికి విరాళం



సూపరింటెండెంట్‌కు విరాళం అందజేస్తున్న పాపినాయుడు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం నర్సాపురానికి చెందిన రౌతు పాపినాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన పద్మ కాంచయ్య, లలిత దంపతులు రూ.లక్ష చొప్పున విరాళం శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, సిబ్బంది చక్రవర్తి, నేతేటి హరిప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



శ్యామ్‌సుందర్

లావేరు: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల పెడరేషన్ కో చైర్మన్ రట్టి శ్యామ్‌సుందర్ కోరారు. శనివారం లావేరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మేనిఫెస్టోలో 99 శాతం హామీలను నెరవేర్చిన రాష్ట్ర సర్కారు కాంట్రాక్టు ఉద్యోగులు సర్వీసు రెగ్యులర్ విషయంలోనూ చొరవ చూపాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకే జీవోతో నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రెగ్యులర్ చేసిందని, ఏపీలోనూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం వన్‌టైమ్ మెజర్మెంట్ ద్వారా కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను రెగ్యులర్ చేసిందని, ఇదే తరహాలో ఏపీ ప్రభుత్వం కూడా రెగ్యులర్ చేయాలని కోరారు.

సమయపాలన పాటించాలి



బూర్జ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ అనూరాధ

బూర్జ : వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.అనూరాధ సూచించారు. శనివారం బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది సమయపాలన, పనితీరుపై ఆరాతీశారు. బయోమెట్రిక్ విధిగా వేయాలన్నారు. గర్భిణులకు 8 నుంచి 22 వారాల వరకు స్కానింగ్ తీసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. జ్వరపీడితుల రక్తన మూనాలు సేకరించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.రాజశేఖర్, ఐ.పావని, సిబ్బంది సతీష్ పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800–00
బంగారం(22సి. 10గ్రా.)	56,650–00
వెండి (కిలో)	78,700–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹145	₹245	₹ 265

ఆర్భాటానికి దూరంగా.. లక్ష్యానికి దగ్గరగా..!

- పునఃప్రారంభమైన మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు
- ప్రధాన ట్రెంచ్‌పై రోజుకు వెయ్యిలారీల మట్టి లోడ్లు
- రైట్‌హెడ్ పనులు సగం పూర్తి
- తుదిదశకు చేరిన ఫ్లడ్ ఫ్లో కెనాల్



ప్రధానమైన ఎర్త్‌బండ్ ఇదే

కాశీబుగ్గ: పలాస మండలం రేగులపాడు వద్ద అసంపూర్తిగా నిలిచిన మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు ఎట్టకేలకు పున:ప్రారంభమయ్యాయి. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు వివిధ కారణాలతో నిలిచిపోయింది. ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మారినా పనుల్లో కదలిక రాలేదు. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాక పనుల్లో కదలిక వచ్చింది. ప్రస్తుతం ఎటువంటి ఆర్భాటం లేకుండా శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రేగులపాడు, చీపురపల్లి ప్రాంతాల్లో చురుగ్గా పనులు ముందుకు సాగుతున్నాయి. ఒడిషా నుంచి వస్తున్న మహేంద్రతనయ నదీజలాలను మళ్లించి ఇక్కడి భూములను సస్యశ్యామలం చేసేందుకు, సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

కొత్త టెండర్ వివరాలివే..

జలయజ్ఞంలో భాగంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.127 కోట్లతో ఈ పనులు ప్రారంభించారు. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిర్మాణ వ్యయం రూ.466.28 కోట్లకు పెంచింది. ఐదేళ్లపాటు కాలయాపన చేసి చివరికి చేతులెత్తేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఓపెన్ టెండర్లు పిలవడంతో శ్రీసాయిలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ అండ్ కో కంపెనీ రూ.299.76 కోట్లకు టెండర్ దక్కించుకుంది. చకచకా పనులు చేపడుతోంది.

ఆర్భాటం లేకుండా..

● అధికారులు, నాయకులు ఎటువంటి ప్రచారాలు చేపట్టకుండా పనులపైనే దృష్టి కేంద్రీకరించారు. జేసీబీలు, డ్రోజర్లు, బుల్డోజర్, ప్రొక్లెయినర్స్, వందలాది టిప్పర్ లారీలతో పని ప్రదేశంలో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పటికే పరిహారం చెల్లించి పంటపొలాల్లో ఉన్న మట్టిని ఇక్కడికి తరలిస్తున్నారు. గత రెండు దఫాలుగా కేవలం నలభైశాతం పనులు మాత్రమే జరగడంతో ఈసారి మొత్తం పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకుసాగుతోంది.

● ప్రధాన ట్రెంచ్ నిర్మాణానికి రోజుకు వెయ్యి టిప్పర్ల మట్టిని వేస్తున్నారు. బుల్డోజర్లతో సరిచేసి హెవీ రోడ్డు రోలర్‌లతో సమం చేస్తున్నారు.

● పనులకు ఎప్పటికప్పుడు వాటరింగ్ చేసి ఎర్త్‌బండ్ గట్టిగా ఉండే చర్యలు చేపడుతున్నారు. 0.350 నుంచి 1.900 కిలోమీటర్లు ఎర్త్ బండ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

● రైట్ హెడ్ స్లైసీ అండ్ ఫ్లడ్ ఫ్లో కెనాల్ పనులు ఇప్పటికే సగభాగం పూర్తయ్యాయి.

● రేగులపాడు, గురుదాసుపురం, చీపురపల్లి గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న డైవెర్షన్ రోడ్డు పనులు సైతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

● అధికారులు, కార్మికులు నివాసముండేందుకు తాత్కాలిక ఇంటి నిర్మాణాలు సైతం ఏర్పాటు చేశారు.



మట్టి వేస్తున్న టిప్పర్లు

అంకెల్లో ఆఫ్‌షోర్..	
భూమి నుంచి రాతికట్టు పొడవు	2,485 కి.మీ.
ఎడమ వైపు హెడ్ నిర్మాణం	0.075 కి.మీ.
స్పిల్ వే	0.120 కిమీ
కుడి వైపు హెడ్ నిర్మాణం	2.10 కి.మీ.
మొత్తం రాతికట్టు వెడల్పు	6.00 మీ
రిజర్వాయర్ కెపాసిటీ	1.86 టీఎంసీ
నది నుంచి రిజర్వాయర్‌కు చేరే నీరు	36 ఎస్క్యూ.కిమీ
రిజర్వాయర్ కింద ఆయకట్టు	26,600 ఎకరాలు
సాగునీటికి	1,947 టీఎంసీ
తాగునీటికి	108 టీఎంసీ



ప్రొక్లెయినర్‌తో మట్టిని సరిచేస్తున్న దృశ్యం

శరవేగంగా పనులు..

రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ పనులు ఎట్టకేలకు పున:ప్రారంభమయ్యాయి. ఎటువంటి ఆటంకాలు లేకుండా పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రధాన ఎర్త్ బండ్ సుమారు రెండు కిలోమీటర్లు దూరం నిర్మాణం జరుగుతుండగా ప్రస్తుతం పనులు 50 శాతానికి దాటిపోయాయి. ఇక పరిస్థితి కొనసాగితే కొద్ది నెలల్లో పనులు పూర్తవుతాయి.

– కొత్తకోట శ్రీకాంత్, డీఈఈ, మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు

సర్వేశాఖలో దొంగలుపడ్డారు!

- సాంకేతిక పరికరాలు మాయం
- నలుగురికి షోకాజ్ నోటీసులు



రోవర్ కంట్రోలర్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు కార్యాలయంలో దొంగలు పడ్డారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రక్ష, రీసర్వేకు ప్రభుత్వం సరఫరా చేసిన సర్వే సాంకేతిక పరికరాలు మాయమయ్యాయి. ఏడీ కార్యాలయంలో అధికారులు, నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఉన్నతాదికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు నలుగురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. గ్రామాల్లో సర్వే పూర్తయిన తర్వాత స్టోన్ ప్లాంటేషన్ కోసం ఉపయోగించే నాలుగు రోవర్ కంట్రోలర్సు కనిపించడం లేదు. వీటితో పాటు మరికొన్ని పరికరాలు కూడా మాయమైనట్లు తెలిసింది. వాటి వివరాలు వెలుగులోకి రాలేదు. సర్వే, స్టోన్ ప్లాంటేషన్‌పై ఉన్నతాధికారులు నిర్వహిస్తున్న టెలీ కాన్ఫరెన్సులో సర్వే అధికారులను ప్రశ్నించడంతో రోబర్లు కంట్రోలర్సు మాయమైనట్టు వెలుగులోకి వచ్చింది. జిల్లాకు 95 రోవరు కంట్రోలర్లు రాగా, ప్రస్తుతం 91 మాత్రమే పనిచేస్తున్నాయి. వాస్తవానికి రోజుకు 9500 స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉంది. నాలుగు కంట్రోలర్లు లేకపోవడంతో రోజూ నాలుగు వంద వరకు తగ్గుతున్నాయి. దీంతో అసలు విషయం బయటపడింది. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో టెక్కలి సబ్ డివిజన్ సర్వేయర్, శ్రీకాకుళం సబ్ డివిజన్ డీఐ, శ్రీకాకుళం మండల తహసీల్దారు, టెక్కలి మండలం తలగాం గ్రామ సచివాలయం సర్వేయర్లు ఉన్నారు. ఈ విషయమై జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ ప్రభాకర్ మాట్లాడుతూ నలుగురికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేశామని, ఇప్పటికే రెండు రోవరు కంట్రోలర్సు దొరికాయని చెప్పారు. మిగిలిన వాటిని రికవరీ చేస్తామన్నారు.

'మొక్కజొన్న కొనుగోలు చేస్తాం'



మొక్కజొన్న గింజలను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్‌పాండ్యా

లావేరు: ప్రతి రైతు వద్ద నుంచి ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేస్తుందని మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండ్యా అన్నారు. మండలంలోని గురుగుబిల్లి, లావేరు గ్రామాల్లో శనివారం ఎండీ రాహుల్ పాండ్యా పర్యటించి ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలించారు. రైతు పండించిన మొక్కజొన్న పంట నాణ్యతను పరిశీలించారు. పంట కొనుగోలును వేగవంతంగా చేపట్టాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగు చేసి ఈ–క్రాప్‌లో నమోదు చేసుకొని పంట కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసిన రైతుల వద్ద నుంచి ప్రభుత్వం పంటను కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు ప్రభుత్వం గోనెసంచులు ఇవ్వడమే కాకుండా గోదాంలకు పంట తరలించడానికి లారీలను కూడ ఏర్పాటు చేస్తుందన్నారు. పంట ప్రభుత్వానికి ఇచ్చిన వారం రోజుల్లోనే డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తామని చెప్పారు. ఆయనతో పాటు మార్కెఫెడ్ డీఎం రమణి, వ్యవసాయశాఖ ఏడీఏ వి శ్రీనివాసరావు, లావేరు ఏఓ డి.మహేష్‌నాయుడు, లావేరు పీఎసీఎస్ సీఈవో మీసాల సత్యనారాయణ, గురుగుబిల్లి, లావేరు రైతు భరోసా కేంద్రాల వీఏఏలు టి.లక్ష్మణ, పి.గిరిజ ఉన్నారు.

నేడు అండర్-16 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్–16 బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలు ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడామైదానం వేదికగా సాయంత్రం 5 గంటలకు జరుగుతాయని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన జిల్లా జట్లను ఈ నెల 16 నుంచి పాలకొల్లు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి అండర్–16 బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలకు పంపిస్తామని చెప్పారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు మైదానం వద్ద డీఎస్ఏ బాస్కెట్‌బాల్ కోచ్ గాలి అర్జునరావు రెడ్డి (సెల్: 9949291288)వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు.

WANTED
Need Qualified , Self disciplined, Hard working and Experienced Faculty

Subject	For Classes
Hindi	- 8th, 9th & 10th stds.
English	- 5th, 6th & 7th stds.
Maths	- 8th, 9th & 10th stds.
Social	- 6th, 7th & 8th stds.
Kinder Garten	- LKG & UKG

NON TEACHING
Office Incharge: Need good computer and Office administration skills
➤ Fluency in English is must
➤ No need to bring atleast single new admission
➤ Holidays as per Government norms
➤ No need to stay after 4.20 pm (for teaching staff only)
Please contact for attractive salary packages & demos schedule
OXFORD SCHOOL OLD APHB COLONY SRIKAKULAM Cell:9154000013

'పిట్ట'కథ చెప్పి.. పుస్తెలతాడు కొట్టేసి..

- 3 తులాల పుస్తెలతాడుతో యువకుడు పరార్
- పొలంలో ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్
- లబ్బ గ్రామ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



బాధితురాలు కడగల సావిత్రి

కొత్తూరు: పొలంలో ఒంటరిగా పనిచేసుకుంటున్న ఓ మహిళ వద్దకు ఓ యువకుడు పిట్టల వేటకు వచ్చానని మాట కలిపాడు. సరదాగా తాను కూడా నువ్వుచేను కోస్తానని నమ్మబలికాడు. ఆ ప్రదేశంలో ఇతరులు ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక చైన్ స్నాచింగ్ పథకం అమలు చేశాడు. ముళ్లతుప్పల్లోకి మహిళను నెట్టేసి మూడు తులాల బంగారు పుస్తెలతాడు తెంచేసి క్షణాల్లో అక్కడి నుంచి పరారయ్యాడు. కొత్తూరు మండలంలోని లబ్బ గ్రామ పరిధిలోని ఓ పొలంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం మెట్టూరు బిట్–3 ఆర్ఆర్ కాలనీకి(ఇరపాడు) చెందిన కడగల సావిత్రి ఈ నెల 11న లబ్బ గ్రామ సమీపంలోని పెద్దచెరువు వద్ద నువ్వుచేను కోస్తుండగా ముఖానికి గుడ్డకట్టుకుని గుర్తు తెలియని యువకుడు వచ్చాడు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు నటిస్తూ సావిత్రి వద్దకు వచ్చి తాగునీరు నీరు కావాలని అడిగాడు. ఎవరని మహిళ ప్రశ్నించగా.. తాను పిట్టల వేటకు వచ్చినట్లు సమాదానం చెప్పాడు. నీరు తాగిన తర్వాత సరదాగా కోత కోసినట్లు నటించాడు. కొద్దిసేపయ్యాక పొలం గట్టుపైకి వచ్చి పరిసరాలు గమనించాడు. ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక మహిళను డొంకల్లోకి నెట్టేసి సుమారు మూడు తులాల బంగారు పుస్తెతాడును తెంచుకొని క్షణాల్లో పరారయ్యాడు. మహిళ తేరుకుని వచ్చేలోగే మాయమయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి భర్త తిరుపతిరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ గోవింద శుక్రవారం కేసు నమోదు చేశారు. సదరు యువకుడు ఉదయం కూడా రెక్కీ నిర్వహించాడని, పొలంలో తాను ఉండటంతో వెళ్లిపోయాడని తిరుపతిరావు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సాహం



సంబరాల్లో నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుండటం వల్లే కర్ణాటకలో బీజేపీకి కాదని అక్కడి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో శనివారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పలాస: మండలంలోని కొబ్బరిచెట్టూరు గ్రామానికి చెందిన దున్న శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈయన మెగా కంపెనీలో స్టోర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. రామకృష్ణాపురం నుంచి శుక్రవారం రాత్రి 7 గంటలకు స్వగ్రామానికి వస్తుండగా ఉద్దానం పైపులైను కోసం తవ్విన గోతిలో పడి గాయపడ్డారు. స్థానికులు స్పందించి పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● తిరుమలలో పలాస తప్పెటగుళ్ల బృందం ప్రదర్శన



తిరుమల తిరుపతి దేవస్థానంలో వారం రోజులుగా జరుగుతున్న గంగాదేవి సంబర మహోత్సవంలో పలాస మండలం రేగులపాడు తప్పెటగుళ్ల బృందం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. టీటీడీ ఆహ్వానం మేరకు పీత గంగయ్య బృందం ప్రదర్శన ఇవ్వగా, ఎమ్మెల్యే భూమా కరుణాకర్ రెడ్డి అభినందించారు. –కాశీబుగ్గ

జంట ఏనుగులతో జాగ్రత్త!

- గిరిజన గ్రామాల్లో అప్రమత్తం చేస్తున్న అటవీ, పోలీస్ అధికారులు
- జంట ఏనుగులు సంచరించే పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు



మనుకొండ సర్పంచ్‌కు 144 సెక్షన్ నోటీస్ అందిస్తున్న అటవీ, పోలీస్ అధికారులు

భామిని: భామిని మండలం పక్కుడుభద్ర–కాట్రగడ గ్రామాల సమీపంలో శుక్రవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఆరు ఏనుగుల గుంపులో నాలుగు మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదం నుంచి తప్పించుకున్న జంట ఏనుగులు మనుమకొండ సమీపంలోని తోటలకు చేరుకుని ఘీంకరిస్తున్నాయి. వాటి ప్రవర్తన ప్రమాదకరంగా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అటవీ, పోలీస్ శాఖ అధికారులు గ్రామాల్లో శనివారం దండోరా వేయించారు. ప్రజలు బయటకు తిరగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. మనుమకొండ, కొత్తూరుగూడ, బొమ్మిక, పక్కుడుభద్ర, కాట్రగడ–బి, వడ్డంగి గ్రామాల సర్పంచ్‌లకు 144 సెక్షన్ నోటీస్‌లు అందజేశారు.

మొక్కజొన్న తోటల్లో నాలుగు ఏనుగులు

మండలంలోని తాలాడ సమీపంలోని ఐలమ్మ తోటల్లో తిష్టవేసిన నాలుగు ఏనుగుల గుంపు సంచారంపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించారు. నాలుగు ఏనుగులు తిరిగే ప్రాంతాల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల స్థితిని గమనిస్తున్నారు. తాలాడ ప్రాంతంలో మూడేళ్లుగా ఏనుగులు మకాం వేసిన సంగతి తెలిసిందే.

నలుగురు పీసీలు, ఇద్దరు హెచ్‌సీల అటాచ్‌మెంట్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను అటాచ్ చేస్తున్నట్లుజిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. లావేరు, ఆమదాలవలస, శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పీసీలు సీహెచ్ చంద్రశేఖర్, ఇ.రామకృష్ణ, ఎ.త్రినాథరావులు శ్రీకాకుళం సీసీఎస్‌కు, శ్రీకాకుళం సీసీఎస్‌లో ఉన్న హెచ్‌సీలు పి.దుర్గారావు, డి.రామారావు, వుమెన్ పీసీ పి.భారతిలు లావేరు, ఆమదాలవలస, శ్రీకాకుళం రెండో పట్టణ పీఎస్‌కు అటాచ్ అయినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Affilated to Dr. YSR UHS, APSAHP Council & Inter Boards
పారా మెడికల్ డైరెక్ట్ అడ్మిషన్లు
DDR COLLEGE VISAKHAPATNAM
Best Job Guaranteed Bachelor & Diploma Courses
• MPHW/GNM
• DMLT/BSC MLT
• D.ANASTESIA/DIALYSIS
• D.CATHLAB
✓30 Years old campus
✓100% Thery and Practicals
✓Parcticals @ KGH ✓100% Placements
✓Best College in Vizag
8919624744, 9700234566, 7989758868

EDUCATION
■ 10th / Inter / Degree Failed (Dont worry) Complete in Short Period and Join for Further Studies in 2023-2024, Pass Guarantee Guidence. Ph : 90599 10102 [V. 1884]

PLOT FOR SALE
■ VZM దగ్గర బాండపల్లి రైల్వేస్టేషన్, రాయపూర్ NH-26 దగ్గరలో ఉరుని ఆనుకొని Govt. Hospital, గుడి ఎదురుగా 100 చ॥గ॥ల స్థలంలు కేవలం 3లక్షల 99వేలు మాత్రమే. ఫోన్ : 92471 35127 [V-1858]

SITE FOR SALE
■ శ్రీకాకుళం టౌన్, APHB కాలనీ, TPM స్కూల్ దరి 5 1/2 సెంట్లు మరియు అరసవిల్లి లక్ష్మీనగర్‌లో 5 సెంట్లు స్థలం అమ్మకమునకు కలదు. సంప్రదించండి. సెల్: 9441440177 [S-771009]

స్థలం అమ్మకం
■ వైజాగ్ మధురవాడ దగ్గర పరదేశిపాలెం నందు హైవే ఫేసింగ్ 255 చ॥గ॥ స్థలం మరియు అందులో గల బిల్డింగ్, మంచి అద్దెలు వచ్చు 4 షాపులు, 20 కార్ల పార్కింగ్‌తో పాటు మంచి ఇన్వెస్ట్‌మెంటుకు అనువైన స్థలం, నో బ్రోకర్స్. ఫోన్ : 90196 39063 [V-794527]

TO -LET
■ శ్రీకాకుళం పట్నం, పెద్దపాడు రోడ్‌లో ఉన్న TVS బైక్ షోరూం ఎదురుగా ఉన్న కమర్షియల్ బిల్డింగ్ నందు గ్రౌండ్, 1st, 2nd, ప్రతి ఫ్లోర్ 1500 sq.ft. గల బిల్డింగ్ బ్యాంకులకు, ఫైనాన్స్ కంపెనీలకు, బైక్ షోరూంలకు, ఆఫీస్‌లకు ఫ్లోర్ విడివిడిగా అయిన లేదా బిల్డింగ్ మొత్తం కలిపి అయిన అద్దెకు ఇవ్వబడును. సెల్: 9177661148, 9494721562 [S-771006]

BUSINESS OFFER
■ ట్రేడింగ్ ద్వారా నెలకు లక్ష రూపాయలు సంపాదించుకొనే అద్భుత అవకాశం. Ph: 7013168624 [H-796783]
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం, ఫోన్ 9310515624, 8800496710 [DA-36266]
■ Ladies Waste Hair Export చేసేందుకు అవకాశం కలదు. ఆంధ్ర తెలంగాణ నుంచి డైరెక్ట్‌గా ఇంటర్నేషనల్ Buyersతో బిజినెస్ మీటింగ్ హైదరాబాద్‌లో జరుగును. Cell: 6302675236 [HA-10778]

WANTED
■ ప్రకాశం జిల్లా, ఒంగోలులో నారాయణ రియల్ ఎస్టేట్ నందు మార్కెటింగ్ స్టాఫ్ M/F కావలెను. Q: 10th - MBA. జీతం + కమీషన్, భోజనం + ఫ్రీ రూమ్‌కలదు. ✆ 63046 42825, 77807 51944 [O-787138]
■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]
■ భారత జాతీయ ప్రభుత్వ సంస్థ (IIHR) రూపొందించిన అత్యంత నిత్యావసరమైన హెల్త్ ప్రొడక్ట్‌ను మీ సిటీలో మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్(M/F) కావలెను. ఆకర్షణీయమైన ఆదాయం కలదు(60000/-) సంప్ర॥ 9381273113, 8179714596 [G-785817]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786248]
■ బ్యాంక్స్‌లో పర్మినెంట్‌గా (Office work) ఖాళీలు : 210 Q: 10th-డిగ్రీ, కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, క్యాషియర్స్, PO's జీ॥ 24000/- Ph: 7816010774 [H-781424]
■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 16K-18K విజయవాడ. ఫోన్: 9640528899, 9640648899 [HA-157]
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-797521]
■ హైదరాబాద్‌లో 5 స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్, సె॥గార్డ్స్, సూ॥వైజర్స్ కావలెను రూం+భోజనం ఫ్రీ జీ: 15,000/- - 30,000/- 7981515640/ 9989930582 [H-781315]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-165]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.